# బాణసంచా వ్యాపార దందా..!



-ఉమ్మడి జిల్లాలో రూ. 15 కోట్ల వ్యాపారం
-అనుమతుల కోసం లక్షలాది రూపాయల వసూళ్లు
-అధికారులకు కమిషన్లు.. వ్యాపారులకు లాభాలు
-భారం వినియోగదారులకు

2లో..

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 11 | అక్టోబర్ | 2025 పేజీలు : 6













# బాణసంచా వ్యాపార దందా..!





**ప్రజాపక్షం/ఖమ్మం :** సంపాదన కోసం ఏ పనైనా చేసేందుకు కొందరు వెనకాడడం లేదు. రూపాయి కోసం దందాలు చేస్తున్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని జరిగే బాణాసంచా వ్యాపారం కొందరికి కాసులు కురిపిస్తుంది. ఈ కాసుల వేటలో కొందరు తమ స్థాయిని మరిచి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వ్యాపారుల మధ్య పోటీ ఒక రకం దందా అయితే అనుమతుల పేరుతో ప్రతి యేటా లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి. వీటికి అనేక ఘటనలు బలం చేకూరుస్తున్నాయి. ఒకప్పుడు కేవలం పండుగ వరకే పరిమితమైన ఈ వ్యాపారం ఇప్పుడు సంవత్సరం పొడవునా నడుస్తుండడంతో బాణాసంచా విక్రయాలు కూడా ఒక వ్యాపారంగా మారింది. ఇందులో తాము మాత్రమే వ్యాపారం చేయాలని ఇతరులు చేయకూడదని లేదా తాము చెప్పిన ధరకే విక్రయించాలనే నిబంధన పేరుతో దందాలకు తెగ పడుతున్నారు. కొణిజర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. బహిరంగంగా ఓ ప్రభుత్వ ఉద్యోగి అసభ్యంగా మాట్లాడుతున్న ఒక వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఇదిలా ఉండగా వివిధ శాఖల అనుమతులతో ఖమ్మం నగరంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దీపావళి దుకాణాలకు అనుమతులు ఇస్తారు. ఈ అనుమతుల దందా జిల్లాలో శృతిమించిందన్న వార్తలు వినవస్తున్నాయి. అనుమతుల కోసం అధికారులకు ఇవ్వాలంటూ లక్షలాది రూపాయలు వసూలు చేయడం జరుగుతుంది. వివిధ శాఖల అధికారులతో పాటు మీడియాకు ఇవ్వాలంటూ కూడా డబ్బులు వసూలు చేస్తున్నారన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. మున్సిపల్, అగ్నిమాపక శాఖ, పోలీస్, రెవెన్యూ శాఖలతో పాటు మీడియా పేరుతో కూడా వసూళ్లు చేస్తున్నారు. కమిషన్ల పేరుతో దుకాణ నిర్వహకుల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లు చేయడం ఆ భారాన్ని వినియోగదారులపై వేస్తున్నారు. ఇప్పటికే బాణాసంచా ఎంఆర్‌పి విక్రయించే దానికి సంబంధం లేదు. ఎవరి ఇష్టాను సారంగా వారు విక్రయాలు జరుపుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. నాణ్యత లేకపోవడం, లాభార్జనే ధ్యేయంగా వ్యవహరించడం వల్లే ఇటువంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. అధికారుల పేరుతో వసూళ్లు చేస్తున్న కమిషన్లకు సంబంధించి ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించాలని దీపావళి మందుల పేరుతో జరిగే వసూళ్లకు ఫుల్ స్టాప్ పెట్టాలని వినియోగదారులు కోరుతున్నారు. అధికారుల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వ్యాపారిని బెదిరించిన విషయమై కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో కొందరు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో ఎటువంటి రాజకీయ జోక్యానికి తావులేకుండా బెదిరింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు.

# జరగని ఎన్నికలకు భారీ ఖర్చు

**-పలుమార్లు ఓటరు జాబితా తయారీ**
**-సామగ్రి కొనుగోళ్లు**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** జరగని పెళ్లికి హడావుడి ఎక్కువ అన్నట్లు ఇప్పుడు జరగని ఎన్నికలకు ఖర్చు ఎక్కువైంది. ఎప్పుడో 20 మాసాల క్రితం జరగాల్సిన ఎన్నికలు పలుమార్లు వాయిదాపడుతూ వచ్చాయి. చివరకు షెడ్యూల్ ఇచ్చి నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత కూడా వాయిదావేయక తప్పని స్థితి. ఎన్నికలు జరిగినా జరగకపోయినా అధికారుల ఆదేశాల మేరకు మండల స్థాయి యంత్రాంగం ఎన్నికల తంతు పూర్తి చేయడం, వాయిదా పడటం జరుగుతూ వస్తుంది. ఈ ఏడాది జనవరి మాసంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓటరు జాబితాలను తయారు చేసి ప్రతి గ్రామ పంచాయతీకి ఐదు సెట్ల చొప్పున జిరాక్స్‌లు తీయించారు. అప్పుడు ఎన్నికలు జరగలేదు. తర్వాత పలుమార్లు ఓటరు జాబితాను సవరించాల్సి రావడం సవరించిన ప్రతిసారి జిరాక్స్‌లు తీయించడం రాజకీయ పార్టీలకు అప్పగించడం జరుగుతుంది. ఇంత వరకు ఏడాది కాలంలో ఎన్నికలకు సంబంధించి మండలాధికారులు చేసిన ఖర్చుకు ఒక రూపాయి కూడా విడుదల చేయలేదు. గత నెల చివరి వారంలో షెడ్యూల్ విడుదల కావడం ఆ తర్వాత బిసి రిజర్వేషన్ ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం. తొమ్మిదిని విడుదల చేయడం ఆ తర్వాత నోటిఫికేషన్ విడుదల చేయడం, రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం స్టే ఇవ్వడం చకచకా జరిగిపోయాయి. నామినేషన్ల స్వీకరణ వరకు రావడంతో మండల అధికారులు మొత్తం ఎన్నికల సామగ్రిని సిద్ధం చేయడంతో పాటు ఓటరు జాబితాలను తయారు చేశారు. ఇందుకు సంబంధించి ఇంత వరకు ఒక రూపాయి కూడా విడుదల కాలేదు. జిరాక్స్ షాపుల యజమానులు మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు జిరాక్స్ షాపు యజమానులకు మండల అధికారులు ముఖం చాటేస్తున్నారు.ఎన్నికలుజరిగితే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట ఏమైనా విడుదల చేసేది కానీ ఇప్పుడు ఎన్నికలు జరగనందున ఈ నిధులను ఎలా సమకూరుస్తారన్నది ఇప్పుడు అధికారుల మదిని తొలుస్తున్నది. ఇప్పటికే గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల కాకపోవడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తగు పరిశీలన చేసి మండల అధికారులు చేసిన ఖర్చుకు సంబంధించి నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

# నేడు మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ




**-హాజరుకానున్న కూనంనేని తదితరులు**

**ప్రజాపక్షం/ తల్లాడ :** తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఖమ్మం జిల్లా రెండవ మహాసభ శనివారం తల్లాడలో జరగనుంది. జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న వర్కర్లు ఈ మహాసభకు హాజరుకానున్నారు. నెలకు రూ. 10వేల కనీస వేతనంగా ఇవ్వాలని, ప్రతి ఏజెన్సీకి వడ్డీ లేని లక్ష రూపాయల రుణం అందజేయాలని, నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని, వర్కర్లకు ఆరోగ్య బీమా అమలు చేయాలని తదితర డిమాండ్లతో ఈ మహాసభను నిర్వహించనున్నారు. ఏఐటియుసి ఆధ్వర్యంలో జరిగే ఈ మహాసభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి , సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ హాజరు కానుండగా గౌరవ అతిథిగా సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి హాజరుకానున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ మహాసభకు ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు, ఏఐటియుసి నాయకులు రామకృష్ణ, మద్దోజు శ్రవణ్‌కుమార్, సిపిఐ నాయకులు హాజరుకానున్నారు.

## అధ్యక్ష పదవికి దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ, ఖమ్మం నగర కమిటీ అధ్యక్ష పదవులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐసిసి ఆదేశానుసారం టిపిసిసి సూచన మేరకు ఖమ్మంజిల్లా కాంగ్రెస్ కమిటీ, నగర కమిటీ అధ్యక్ష పదవికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు తమ దరఖాస్తుతో పాటు బయోడేటా కాపీని శనివారం కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో అందజేయాలని కోరారు. వచ్చిన దరఖాస్తులను ఏఐసిసి పరిశీలకులు క్షుణ్ణంగా పరిశీలించి అధ్యక్షున్ని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. శనివారం మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి ఏడు గంటల వరకు కాంగ్రెస్ కార్యాలయంలో ఏఐసిసి పరిశీలకులు అందుబాటులో ఉంటారని వారు తెలిపారు.

## దొడ్డా సురేష్‌కు సిపిఐ నేతల నివాళి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఐ నాయకులు దొడ్డా సురేష్‌కు ఖమ్మం జిల్లాకు చెందిన సిపిఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూర్యాపేట జిల్లా చిలుకూరుకు చెందిన తెలంగాణ సాయుధ పోరాటయోధుడు దొడ్డా నారాయణరావు కుమారుడు సురేష్ గురువారం గుండెపోటుతో మృతిచెందారు. మృతివార్త తెలిసిన వెంటనే సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, ఖమ్మంజిల్లా కార్యదర్శి దండి సురేష్ ,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, జిల్లా నాయకులు కర్నాటి నళిని, పోటు పూర్ణచందర్‌రావు తదితరులు సురేష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సురేష్ మృతితో కమ్యూనిస్టు పార్టీ అంకిత భావంకలిగిన నాయకున్ని కోల్పోయిందని హేమంతరావు తెలిపారు.

## వ్యవసాయ మార్కెట్‌ను అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాలి



**ప్రజాపక్షం/వైరా:** వైరా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బోళ్ల గంగారావుని శుక్రవారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు కాంగ్రేస్ పార్టీ నాయకులు పిసిసి ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణతో కలిసి శాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ మాట్లాడుతూ వైరా వ్యవసాయ మార్కెట్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి పథఃలో నడపడంలో ముందుండాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రేస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, కాంగ్రేస్ పార్టీ నాయకులు వాంకుడోతు బీక్యా, గడసందుల దర్గయ్య, యడ్లపల్లి వీరయ్యచౌదరి, దాసరి దానేలు, శేఖర్ రెడ్డి, ఫణితి శ్రీను, తేజావత్ నాగేశ్వరరావు, పాలేటి నర్సింహారావు, పల్లపు కొండలు, నగేష్, దురిశెట్టి నర్సింహారావు, గుగులోతు దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్‌కు ఎంపికైన బొమ్మరిల్లు




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ కార్యక్రమంలో మూడు నిమిషాల నిడివిలో తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలు, ప్రభుత్వ పథకాలను ప్రతిబింబించేలా రూపొందించిన బొమ్మరిల్లు అనే షార్ట్ ఫిలిం ఎంపికైంది. ఈ షార్ట్ ఫిలింకు దర్శకుడు, నిర్మాతగా సారపాకకు చెందిన ఎస్ఎస్ వంశీ వ్యవహరించారు. తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన వివరాల్లో ఎంపికైన చిత్రాలకు తగిన పారితోషికాలు, గుర్తింపులు ఇవ్వబడతాయని పేర్కొంది. మొదటగా ఈనెల 9న జరగవలసిన కార్యక్రమం, ఎన్నికల కారణంగా వాయిదా పడగా, కొత్త తేదీని త్వరలో ప్రకటించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు దేశం అంతటి పరిచయం చేసే ఉద్దేశంతో ఈ సినిమా రూపొందించారని వంశీ తెలిపారు. ప్రభుత్వం ఇలాంటి ప్రతిభావంతుల్ని ప్రోత్సహించడం సంతోషకరమని, వంశీ ఇప్పటికే ఎన్నో షార్ట్ ఫిలిమ్స్, కవర్ సాంగ్స్ చేసి, తన ప్రత్యేకతను చూపించారు. ఆయన ప్రతిభను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వానికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ మహాసభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/కల్లూరుః** మధ్యాహ్న భోజన పథకం కార్మికుల మహాసభను జయప్రదం చేయాలని జిల్లా ఏఐటియుసి ఉపాధ్యక్షులు వేము రాంబాబు కార్మికులను కోరారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో ఉన్న కార్మికులకు మధ్యాహ్న భోజనం కార్మికుల కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి భవిష్యత్తు పోరాటాలను రూపు కల్పనకు నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవటానికి అక్టోబర్ 11వ తేదీ శనివారం జిఎన్ఆర్ ఫంక్షన్ హాల్ తల్లాడ లో ఈ మహాసభ జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్న భోజనం వర్కర్ యూనియన్ ఖమ్మం జిల్లా మహాసభ నిర్వహించ దల్చాం కార్మికుల సమస్యల పరిష్కరించడానికి హక్కులు సాధించడానికి ఏఐటీయూసీ అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని ఐక్య పోరాటాలు చేయడానికి ఈ మహాసభ వేదిక కానుందని ఈ మహాసభకు కార్మికులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు సత్యవతి, వెంకటలక్ష్మి , అప్పమ్మ, అనసూర్య, పుల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలి




**-అటెండెన్స్ ఆన్‌లైన్ ద్వారా నమోదు**
**-నిర్లక్ష్యంగా వ్యవహరించే ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు**
**-వైద్య ఆరోగ్యశాఖపై కలెక్టర్ సమీక్ష**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిహెచ్‌సిలలో పనిచేసే సిబ్బంది అటెండెన్స్ ఆన్‌లైన్ చేసి వంద శాతం మానిటరింగ్ చేయాలన్నారు. ప్రసవ సమయంలో తల్లి మరణాలకు సంబంధించి కేసులను పరిశీలిస్తే రెండవ ఎఎన్‌సి చెకప్ ప్రైవేటు ఆసుపత్రులో చేసుకున్నట్లు తేలిందని దీనికి గల కారణాలను కలెక్టర్ ఆరా తీశారు. గత సంవత్సర కాలంగా ప్రతి ఆశా కార్యకర్త పరిధిలో మొదటి, రెండవ ఏఎన్‌సి చెకప్, ప్రైవేటు ఆసుపత్రిలో జరిగిన కేసులు పరిశీలించి రిపోర్టు అందించాలన్నారు. ప్రతి వైద్యాధికారి తన పరిధిలోని ఆశా కార్యకర్తలతో రెగ్యులర్‌గా సమావేశాలు నిర్వహించాలన్నారు. గర్భిణీలకు చికిత్సలు అందించడంలో నిర్లక్ష్యం వహించిన ప్రైవేటు ఆసుపత్రులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ఆశాలు తమ పరిధిలో రెగ్యులర్‌గా ఇంటింటి సర్వే చేస్తూ గర్భిణీ మహిళల వంద శాతం ఏఎన్‌సి రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న వసతులు ప్రైవేటు ఆసుపత్రిలో లేవని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అధికంగా ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సి సెక్షన్ డెలివరీలను నివారించాలన్నారు. సి సెక్షన్ జరుగుతున్న ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులపై నిఘా పెట్టాలన్నారు. ప్రతి పిహెచ్‌సి పరిధిలో వంద శాతం పిల్లలకు టీకాలు వేయించాలని టీకాలపై వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధవహించాలన్నారు. ఎన్‌సిడి సర్వే పూర్తి చేసి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధి నిర్ధారణ కిట్లు ప్రతి పిహెచ్‌సిలో అందుబాటులో ఉంచాలన్నారు. గత సంవత్సరం కంటే 58 శాతం డెంగ్యూ కేసులు తగ్గాయని దీనికి కృషి చేసిన అధికారులను కలెక్టర్ అభినందించారు. టిబి నిర్మూలనకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. పిహెచ్‌సి పరిధిలో సికిల్ సెల్ అనిమియా క్యారియర్స్‌కు అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. అనంతరం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన ఫీజులు ఉపసంహరించుకోవాలి




**-విద్యార్థులపై ఫీజుల భారాన్ని తగ్గించాలి**
**-ఏఐఎస్‌ఎఫ్ డిమాండ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలో డిగ్రీ కోర్సుల మొదటి సంవత్సరం విద్యార్థులకు భారీగా పెంచిన వివిధ రకాల ఫీజులను ఉపసంహరించుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. విద్యార్థులపై భారం మోపితే ఆందోళన తప్పదని ఆయన హెచ్చరించారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్‌ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సులకు సంబంధించి ఈ ఏడాది మొదటి సంవత్సరం ప్రవేశాలు పొందిన విద్యార్థులకు వివిధ రకాల ఫీజులను భారీగా పెంచిందన్నారు. ఒక్కో విద్యార్థికి గతంలో రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 80లు ఉండగా ఇప్పుడు రూ. 1200లకు పెంచారని, రికగ్నేషన్ ఫీజు గతంలో రూ. 400 ఉండగా ఇప్పుడు రూ. 800లకు, ఐయుడిఎఫ్ ఫీజు గతంలో రూ. 60 ఉండగా ఇప్పుడు రూ. 300లకు, ఎస్‌డబ్ల్యూఎఫ్ ఫీజు గతంలో రూ. 50 ఉండగా ఇప్పుడు రూ. 200లకు పెంచి విద్యార్థులపై తీవ్ర భారాన్ని మోపారన్నారు. ఒక పరీక్ష ఫీజు మాత్రమే గతంలో ఉన్న రూ. 750లను యధావిధిగా కొనసాగిస్తున్నారని తెలిపారు. గతంలో ఒక్కో విద్యార్థి వివిధ రకాల ఫీజుల క్రింద రూ. 1340 చెల్లించారని ఇప్పుడు ఏకంగా అన్ని ఫీజులు కలిపి రూ. 3,250కు పెరిగిందన్నారు. దీని వల్ల ఒక్కో విద్యార్థిపై గతంలో కంటే సుమారు రెండువేల ఫీజు భారం అధికంగా పడుతుందన్నారు. పేద విద్యార్థులకు పెంచిన ఫీజులు భారమవుతాయని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. లేని పక్షంలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై ఆందోళన చేపడతామని రామకృష్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివ, వంశీ, మనోజ్, జిల్లా నాయకులు పవన్, గోపి, ఉపేందర్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# రెనాల్ట్ నిస్సాన్‌కు 65 మంది విద్యార్థులు ఎంపిక



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రముఖ అంతర్జాతీయ వాహన రంగ సంస్థ రెనాల్ట్ నిస్సాన్‌కు ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 65 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శుక్రవారం కళాశాల ఆవరణలో జరిగిన ప్రాంగణ నియామకాల్లో గుండాల కృష్ణ మాట్లాడుతూ పెరుగుతున్న ప్రమాణాల దృష్ట్యా వాహన రంగంలో రానున్న రోజుల్లో మరింత ఆదరణ ఉంటుందన్నారు. అత్యంత వేగంగా విస్తరిస్తున్న రంగాల్లో వాహన రంగం ముందుందన్నా రు. ఎంపికైన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥జి.ధాత్రి మాట్లాడుతూ రెనాల్ట్ నిస్సాన్ వంటి అంతర్జాతీయ సంస్థల్లో తమ విద్యార్థులు ఎంపిక కావడం హర్షించ దగ్గ విషయమన్నారు. కేవలం సాఫ్ట్‌వేర్ రం గాల్లోనే కాకుండా ఇతర కోర్ రంగాల వైపు కూడా యువత దృష్టి సారించాలన్నారు. ప్రొడక్షన్ ఇంజనీర్ ఉద్యోగాలకు జరిగిన ఎంపికలలో 136 మంది ఈసిఈ, 112 మంది ఈఈఈ విద్యార్థులు పాల్గొన్నారని ఆమె తెలిపారు. వ్రాత పరీక్షలు, మౌఖిక ప రీక్షల అనంతరం తుది పరీక్షలో 65 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఇతర సదుపాయాలతో పాటు వార్షిక వేతనం మూడు లక్షలు ఉంటుందని తెలిపారు. ప్రిన్సిపాల్ డా॥ రాజ్‌కుమార్ మాట్లాడుతూ సెల్ఫ్ డ్రైవింగ్ కార్స్, ఏఐ ఆధారిత ఎలక్ట్రికల్ రంగాలు ఆధునీక టెక్నాలజీని శాసిస్తున్నాయన్నారు. వాహనాల తయారీ, స్పేర్స్, బ్యాటరీలు అందించే రెనాల్ట్ నిస్సాన్ వంటి సంస్థలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నాయన్నారు. ఎంపికైన విద్యార్థులు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపికలు నిర్వహించిన టాలెంట్ ప్రో హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ ఎం. ప్రకాష్ మణితో పాటు అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జే. రవీంద్రబాబు, టిపివో ఎన్. సవిత, కో ఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో రైల్వే ఉద్యోగి మృతి



**ప్రజాపక్షం/ బోనకల్ :** అనుమానాస్పద స్థితిలో ఓ రైల్వే ఉద్యోగి మృతి చెందిన సంఘటన బోనకల్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బోనకల్ రైల్వే హెడ్ క్వార్టర్స్ రైల్వే ఉద్యోగిగా పనిచేస్తున్న ఎస్కే ఖాదర్‌బాబు అనే వ్యక్తి అనుమానాస్పద స్థితి మృతి చెందాడు. గత రెండు రోజులుగా దుర్వాసన రావడంతో స్థానికులు పరిశీలించగా ఆయన మృతదేహం పురుగులు పట్టి కన్పించింది. వెంటనే సమాచారం అందుకున్న ఎస్సై పోదిలి వెంకన్న అక్కడికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# టీచింగ్ పోస్టులకు దరఖాస్తులను సమర్పించాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలలను ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులకు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పని చేయుటకు ఆసక్తి గల వారు అక్టోబర్ 15లోపు దరఖాస్తులను సమర్పించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎండి ముజాహిద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లి బాయ్స్ నందు జనరల్ టిజిటి ఇంగ్లీష్, నేలకొండపల్లి బాయ్స్ నందు జనరల్ జెవిఎల్ మ్యాథ్స్, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేలా ఖమ్మం బాలికల జూనియర్ కళాశాల నందు మ్యాథ్స్, కెమిస్ట్రీ, జువాలజీ పోస్టులు, వైరా గర్ల్స్ నందు పిజిటి ఇంగ్లీష్, ఖమ్మం గర్ల్స్ నందు ఫిజికల్ డైరెక్టర్ పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. జెవిఎల్, పిజిటి పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో 50 శాతం మార్కులతో పాటు బిఈడిలో 50 శాతం మార్కులు, టిజిటి పోస్టులకు సంబంధిత సబ్జెక్టు గ్రాడ్యుయేషన్, బిఈడిలో 50 శాతం మార్కులతో టెట్ తప్పనిసరి అన్నారు. మూడేళ్ల బోధనా అనుభవంతో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్, ఫోటో కాపీలు, ఇతర పత్రాలు సంబంధిత మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల నందు అక్టోబర్ 13 నుంచి అక్టోబర్ 15 సాయంత్రం నాలుగు గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలని షార్ట్‌లిస్టు అయిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయన్నారు. నియామకాలు పూర్తిగా ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన తాత్కాలికంగా ఉంటాయని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మైనార్టీ సంక్షేమ అధికారి తెలిపారు.

# డయల్ యువర్ డిఎంకు స్పందన

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** డయల్ యువర్ డిఎం కార్యక్రమానికి స్పందన లభించిందని ఖమ్మం డిపో మేనేజర్ ఎం. శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఖమ్మం డిపో పరిధిలో నిర్వహించిన డయల్ యువర్ డిఎం కార్యక్రమంలో పలువురు ప్రయాణికులు వారి సమస్యలు, సూచనలు అందించారని డిఎం తెలిపారు. ఖమ్మం నుండి బోనకల్‌కు పల్లెవెలుగు సర్వీసులను పెంచాలని, ఖమ్మం జక్కేపల్లి సర్వీస్ సమయాన్ని సవరించాలని ఖమ్మం నుండి కోదాడకు పల్లెవెలుగు ఛార్జీలను తగ్గించాలని, ఖమ్మం నుండి గారెపాడుకు సర్వీస్ పెంచాలని ప్రయాణికులు కోరినట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులు చెప్పిన సమస్యలను, సూచనలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డిఎం శివప్రసాద్ తెలిపారు.

# 28 లోగా దరఖాస్తులు సమర్పించాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ వైద్య కళాశాల ఖమ్మం నందు డిప్లోమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్ (30 సీట్లు), డిప్లోమా ఇన్ మెడికల్ ఈమేజింగ్ టెక్నీషియన్ (30 సీట్లు) రెండేళ్ల వ్యవధి గల కోర్సులో చేరుటకు అక్టోబర్ 28 లోపు దరఖాస్తులు సమర్పించాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా॥ టి. శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బైపిసి చేసిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, ఎంపిసి ఇతర అర్హులైన అభ్యర్థులు తదుపరి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు https://tgpmb.telangana.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పూర్తి చేయాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు పత్రాన్ని ప్రింట్ తీసి ధృవపత్రాలు జత చేసి ప్రభుత్వ వైద్య కళాశాల ఖమ్మం కార్యాలయంలో అక్టోబర్ 28 సాయంత్రం ఐదు గంటల లోపు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల ఖమ్మం వెబ్ సైట్ https://gmckhammam.org సందర్శించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

# ఎన్నికల హామీ ప్రకారమే 42 శాతం బిసి రిజర్వేషన్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో ఎన్నికల హామీల్లో భాగం గా బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ను క్యాబినెట్‌లో ఆమోదించి బిల్లు ప్రవేశపెట్టిందని బిసి సంఘాల నాయకులు, కార్పొరేటర్ కమర్తపు మురళి, ఏఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు తెలిపారు. శుక్రవారం మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్‌తోనే కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు వెళ్తుందని తెలిపారు. రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారమే 42 శాతం బిసి రిజర్వేషన్ సాధించుకుంటామన్నారు. బిఆర్‌ఎస్, బిజెపి బిసి రిజర్వేషన్‌కు అడ్డుపడుతున్నాయని వారు ఆరోపించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహారా, బిసి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ ఉద్యమ నేతకు ఘన నివాళి




**ప్రజాపక్షం/బోనకల్ :** యుటిఎఫ్ పూర్వ అధ్యక్షులు నాగటి నారాయణ తృతీయ వర్ధంతి సందర్భంగా టిఎస్‌యుటిఎఫ్ బోనకల్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వారి స్వగ్రామం పెద్ద బీరవల్లి గ్రామంలో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టిఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ యుటిఎఫ్ అధ్యక్షులుగా సుదీర్ఘకాలం పని చేసిన నాగటి నారాయణ ఉపాధ్యాయ ఉద్యమానికి ఎనలేని సేవ చేశారని, ఉపాధ్యాయ ఉద్యమానికి రథసారధిగా ఉపాధ్యాయులకు అనేక ప్రయోజనాలు సాధించి పెట్టారని, కడ వరకు తాను సమసమాజ స్థాపన నవ సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వ విద్యారంగ బలోపేతం కోసం కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిన్న రంగారావు, మండల ఉపాధ్యక్షులు పి.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## పారుపల్లి కుటుంబానికి పరామర్శ



ప్రజాపక్షం/ మధిర : మధిర మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పారుపల్లి విజయ్ మాతృమూర్తి పారుపల్లి విమల ఇటీవల మృతి చెందిన సంగతి విధితమే. శుక్రవారం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సతీమణి, అమ్మా ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని వారి నివాసానికి వెళ్లి పారుపల్లి విమల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస రెడ్డి, పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమరజీవి నారాయణ ఆశయాలు కొనసాగిస్తాం



ప్రజాపక్షం/ మధిర : ఉమ్మడి రాష్ట్ర ఉపాధ్యాయ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి ఎస్‌టిఎఫ్ఐ ఉపాధ్యాక్షుడిగా ఉపాధ్యాయ ఉద్యమానికి విశిష్టమైన సేవలందించిన అమరజీవి నారాయణ ఆశయాలను కొనసాగిస్తామని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టిఎస్‌యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి షేక్.నాగూర్‌వలీ, మధిర మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.నాగరాజు, ఈ వీరయ్యలు అన్నారు. స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నాగటి నారాయణ ఉపాధ్యాయ ఉద్యమానికి దిక్సూచిగా పనిచేశారని, అప్పుడే మనల్ని విడిచి వెళ్లి మూడు సంవత్సరాలు గడించిందని, వారి స్ఫూర్తితో విద్యారంగ అభివృద్ధి, బలోపేతం కోసం ఉపాధ్యాయులు ఉద్యమం కొనసాగించాలన్నారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షులు షేక్. ఇబ్రహీం, కోశాధికారి బి.చెన్నయ్య,, ఎఫ్ డబ్ల్యూఎఫ్ కన్వీనర్ ఎం.రాజు, మహమ్మద్ రఫీ, షేక్‌లాల్‌అహ్మద్ ,లంకా నాగేశ్వరరావు, కూరపాటి రమేష్, బొబ్బిళ్ళపాటి రమేష్ నిమ్మగడ్డ గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్



ప్రజాపక్షం/ మధిర : మధిర పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ప్రిన్సిపాల్ బి.జైదాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలోని పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓ బి.తౌరియా, బి.ఉపేందర్, ఆర్‌సిహెచ్ సాంబయ్య, జి.విక్రమ్, జి.కృష్ణ, టి.నాగరాజు, ఎం.లాలయ్య, కె.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ అనుమతులు లేకుండా పురుగుమందులను విక్రయిస్తే కఠిన చర్యలు



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : తిరుమలాయపాలెం మండల పరిధిలోని పిండిప్రోలు, తిరుమలాయపాలెం గ్రామాల్లో పురుగుమందుల షాపులను మండల వ్యవసాయ అధికారి నారెడ్డి సీతారామిరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనుమతులు లేని పురుగుమందులను రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కోర్టు ఆర్డర్ ఉన్న బయో మందులను విక్రయిసున్న రికార్డులను పరిశీలించారు. కోర్టు ఆర్డర్ ఉన్న బయో మందులను విక్రయించుకోవచ్చునని, ప్రతి డీలర్ ప్రభుత్వ అనుమతులు లేని మందులను విక్రయిస్తే చర్యలు తప్పవని, లైసెన్స్‌లు రద్దు చేసి తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. రైతులకు విక్రయించే మందుల వివరాలను రసీదులపై పొందుపర్చాలని రైతుల సంతకాలు తీసుకోవాలని ప్రతి రైతుకు రసీదు ఇవ్వాలని డీలర్లకు వివరించారు.

## నాగేశ్వరరావు కుటుంబానికి ఆర్థికసాయం



ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం మండలంలోని తాటి గూడెం గ్రామానికి చెందిన కొమరం నాగేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. పేదరికం తో ఉండటమే కాక, మృతునికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్న విషయం తెలుసుకున్న కొత్తగూడ (గతంలో కరకగూడెం మండలంలో ఎస్సైగా విధులు నిర్వహించారు) ఎస్సై ఇమ్మడి రాజకుమార్ 5000 రూపాయలు ఆర్థిక సహాయం శుక్రవారం అందజేశారు. ఈ నగదును తాటి గూడెం గ్రామ పెద్దమనుషుల సమక్షంలో అందించారు.

# ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి

**-పారిశుధ్యంపై 10 రోజులు స్పెషల్ డ్రైవ్**
**-పారిశుధ్య నిర్వహణపై కలెక్టర్ సమీక్ష**




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో పారిశుధ్య నిర్వహణపై మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో మరింత మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ చేపట్టేందుకు అక్టోబర్ 13 (సోమవారం) నుంచి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు 10 రోజులు పాటు చేపట్టడం జరుగుతుందన్నారు. నగరంలో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేయాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జవాన్ నుంచి సహాయ కమిషనర్ వరకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధతో ఈ డ్రైవ్ చేపట్టాలన్నారు. శుభ్రం చేసిన ప్రాంతాల్లో ముందు ఆ తర్వాత తేడాను తెలియజేసేలా ఫోటోలు తీయాలని అవసరమైతే అదనపు సిబ్బందిని, ఎక్విప్‌మెంట్‌ను అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. జవాన్ వారీగా రోజుకు ఏ ప్రాంతంలో ఎన్ని కిలో మీటర్లు రోడ్లు శుభ్రం చేస్తున్నారు తెలియజేసేలా ప్రోఫార్మా తయారు చేయాలన్నారు. ఆకస్మికంగా తనిఖీ చేస్తామని అపరిశుభ్రంగా ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయన్నారు. స్పెషల్ డ్రైవ్ సందర్భంగా శానిటేషన్ జవాన్, సిబ్బందికి సెలవులు రద్దు చేయాలన్నారు. వార్డు అధికారులు కూడా క్షేత్ర స్థాయిలో పని చేయాలని కలెక్టర్ తెలిపారు. నగర వ్యాప్తంగా ఉన్న డ్రైన్, పూడికతీత పనులు చేపట్టాలన్నారు. పబ్లిక్ పార్కు, బస్‌స్టాప్స్, పబ్లిక్ టాయిలెట్లను పూర్తిగా శుభ్రం చేయాలన్నారు. నగరంలో ఉన్న ఖాళీ స్థలాలను వంద శాతం శుభ్రం చేయాలని, పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. ప్రైవేటు ఖాళీ స్థలాలు శుభ్రం చేసుకునేలా యజమానులకు నోటీసులు అందించాలన్నారు. రోడ్డు మీద నిర్మాణ వ్యర్థాలు ఉండటానికి వీలు లేదన్నారు. హోటల్స్, వ్యాపార వాణిజ్య సంస్థలు బయట ఎక్కడైనా చెత్త వేస్తే వారి లైసెన్స్‌లను రద్దు చేయాలని కలెక్టర్ తెలిపారు. 15 రోజుల్లో ఖమ్మం నగరంలో ప్రధాన రహదారిపై ఎక్కడ గుంటలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్, జవాన్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల బిల్లు మంజూరులో జాప్యమేలా..?

**- మనోవేదనలో లబ్ధిదారులు**






ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : తిరుమలాయపాలెం మండల పరిధిలోని కొందరి పంచాయతీ కార్యదర్శుల తీరుతో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తలలు పట్టుకుంటున్నారు. తమకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేసిన ఇంతవరకు ఇంటి నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా ఖాతాలో జమ కాలేదని, మొత్తం అప్పులు తెచ్చి సగం వరకు ఇల్లు నిర్మించామని, ఇప్పటికి రూపాయి కూడా పడకపోవడంతో ఇంటి నిర్మాణం ఆగిపోయిందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. బీరోలు గ్రామంలోని సుమారు 40 ఇందిరమ్మ ఇండ్లు మంజూరై నిర్మాణం చేపట్టి నెలలు గడుస్తున్న ఇంతవరకు కొంతమంది లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ కాలేదని అక్కడి లబ్ధిదారులు మొరపెట్టుకుంటున్నారు. అసలు కారణం పంచాయతీ కార్యదర్శి అవగాహన లోపమని, ఆయన ఆన్‌లైన్ ప్రక్రియ సరిగా చేయటం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఎన్నిసార్లు చేసినా రిజెక్ట్ అవుతున్నాయని, ఈ విషయంపై హౌసింగ్ ఎఈని వివరణ అడగగా బీరోలు గ్రామంలో 40 ఇండ్లు మంజూరు కాగా ఇప్పటికే సగం బిల్లులు చెల్లించామని, కేవలం ముగ్గురికి పూర్తిగా పడలేదని, అది గ్రాండ్ లెవల్‌లో సమస్య ఉందని, కలెక్టర్ దృషికి తీసుకెళ్లామని, రెండు మూడు రోజుల్లో ఆ బిల్లులు పడతాయని ఆయన వివరించారు.

# ఆటో మోటార్ కార్మికుల సమస్యలను పరిష్కరించేది ఏఐటీయూసీనే..

**-ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్‌లో భారీ చేరికలు**
**-ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదు**
**-కంచర్ల జమలయ్య**



ప్రజాపక్షం/సుజాతనగర్: సుజాతనగర్ మండల టో డ్రైవర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆటో కార్మికులను చైతన్యపరిచి ఉద్యమం తప్పదని ఏఐటియుసి ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు.శనివారం సుజాతనగర్ మండలంలోని మంగపేట గ్రామంలో 40 మంది ఆటో డ్రైవర్లు వివిధ యూనియన్ నుండి ఏఐటీయూలోకి చేరారు. తనంగా చేరిన వారికి ఏఐటియుసి ఎర్ర కండువాలను కప్పి ఆహ్వానించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఏఐటియుసి దిమ్మెను ప్రారంభించి జండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కంచర్ల జమలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఆటో డ్రైవర్లు కిరాయిలు లేక కుటుంబాన్ని పోషించుకోవడం ఇబ్బందిగా మారిందన్నారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12 వేల రూపాయలను తక్షణమే మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ పథకంలో అర్హులైన ఆటో డ్రైవర్ల అందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని తెలిపారు. దీపావళి లోపు వాహన మిత్ర పథకం రాష్ట్ర వ్యాప్తంగా వర్తింపజేయాలని లేనిపక్షంలో ఆటో డ్రైవర్ లను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా బందుకు పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం మంగపేట గ్రామంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొర్ర మోహన్, గౌరవ అధ్యక్షులుగా కిషన్, సలహాదారుడుగా బిక్కులాల్, కార్యదర్శిగా గుగులోతు నాగేష్, ఉపాధ్యక్షులుగా దేవరాజు, ఆర్గనైజర్‌గా బి రమేష్, సహాయ కార్యదర్శిగా రాజ్ కుమార్, మురళి, శివరాం, నవీన్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమైక్య రాష్ట్ర అధ్యక్షులు భూక్య దశ్రు, ఆటోవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కృష్ణ, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుమారి హనుమంతరావు, సిపిఐ సీనియర్ నాయకులు భాగం శేష భూషణం, భాగం కృష్ణ, మూడు గణేష్, సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు, ప్రజా సంఘాల బాధ్యులు, ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణ అయోధ్యకు నూతన శోభ

**-రామాలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**
**-టిటిడి ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం**
**-దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో మంత్రి తుమ్మల సమీక్ష**



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాద్రి శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయానికి నూతన శోభ సంతరించుకోనుంది. ప్రజల మనస్సుల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన భద్రాచలం రామాలయ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సచివాలయంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌తో పాటు ఆలయ అధికారులతో అభివృద్ధి పనులపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయ విస్తరణ కోసం భూ సేకరణ పూర్తి అయిందని, చుట్టూ ఉన్న మాఢవీధుల విస్తరణ పనులు, ప్రాకార గోడల నిర్మాణాలు తక్షణమే ప్రారంభించాలని తెలిపారు. ఆగమ శాస్త్ర ప్రమాణాలకు అనుగుణంగా ఆర్కిటెక్ రూపొందించిన డిజైన్లను ఫైనల్ చేసి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఆలయ నిర్మాణంలో ప్రతి అంశం ఆగమ శాస్త్రం ప్రకారం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. భక్తుల వసతి, రవాణా, పార్కింగ్, నీటి సదుపాయం వంటి మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. భద్రాద్రి రామాలయంలో చేపట్టే అభివృద్ధి పనులు దేశ వ్యాప్తంగా భక్తులను ఆకర్షించే విధంగా ఉండాలన్నారు. అభివృద్ధి పనులపై నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రామాలయం పునరుద్ధరణ పనులు పూర్తయిన వెంటనే అక్కడ విశాలమైన యజ్ఞశాల, రామకోట మాఢవీధులు ఆధునీక కట్టడాలతో కొత్త చరిత్ర సంతరించుకుంటుందని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందు కోసం మూడు అనువైన ప్రాంతాలను జిల్లా కలెక్టర్ టిటిడి అధికారులకు ప్రతిపాదించినట్లు తెలిపారు. సోమవారం టిటిడి అధికారులు ఖమ్మం నగరానికి వచ్చి క్షేత్ర పరిశీలన జరిపి ఆలయ స్థలాన్ని ఖరారు చేస్తారని మంత్రి తెలిపారు. వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం పూర్తయితే ఖమ్మంజిల్లాలో భక్తి, పర్యాటక రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడుతుందని మంత్రి ఆకాంక్షించారు.

# సర్వేను అడ్డుకున్న బాధిత రైతులు





ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : నాగపూర్ అమరావతి జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించిన సర్వేను బాధిత రైతులు అడ్డుకున్నారు. నాగపూర్ అమరావతి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం రెవెన్యూ పరిధిలో రహదారి నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ చేపట్టారు. సర్వే నెం. 161, 162, 273, 281, 282, 285, 286 లలో భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే దీనికి సంబంధించి బాధిత రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉండగా శుక్రవారం వి. వెంకటాయపాలెం వద్ద రెవెన్యూ, ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్‌హెచ్ అధికారులు భూ సేకరణకు సంబంధించి సర్వే నిర్వహించారు. ఆయా భూముల్లో ఉన్న మొక్కలు, బావులు, ఇతర ఆస్తుల వివరాలు సర్వే చేయడానికి వచ్చిన అధికారులను బాధిత రైతులు అడ్డుకున్నారు. హైకోర్టు స్టే అమలులో ఉన్న నేపథ్యంలో సర్వే చేయడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. బాధిత రైతుల ఆందోళన నేపథ్యంలో అధికారులు సర్వే పనులు నిలిపివేశారు. శుక్రవారం హైకోర్టులో విచారణకు వచ్చిందని జాతీయ రహదారుల న్యాయవాదుల అభ్యర్థనతో కేసు బుధవారంకు వాయిదాపడిందని బాధిత రైతులు తెలిపారు.

## ఒకే ఏడాదిలోఎంబీబీఎస్ సీట్లు సాధించిన ఇద్దరు ముస్లిం యువతీలు..!

**సమీన, ఆయేషాలకు ఘనసన్మానం**



ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం మండల కేంద్రంలోని జామే మసీదులో, కరకగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు ముస్లిం మైనార్టీ యువతులు ఒకే సంవత్సరంలో ఎంబిబిఎస్ కోర్సులో ఎంపిక కావడం ఆనందకర విషయం. వీరిలో ఒకరు సయ్యద్ సమీనా (తండ్రి: సజ్జాద్ హుస్సేన్), మరొకరు మొహమ్మద్ ఆయేషా (తండ్రి : మహమ్మద్ రఫీ,ఆర్ఎంపి). ఇద్దరూ ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించడం ద్వారా మైనార్టీ విద్యార్థులకు స్ఫూర్తిదాయక ఉదాహరణగా నిలిచారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ పెద్దలు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ వారికి, తల్లిదండ్రులకు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యువతులు తమ కృషి, పట్టుదలతో ఎంబిబిఎస్ సీట్లు సాధించి కుటుంబానికి గ్రామానికి గర్వకారణమయ్యారని అన్నారు. ఒకే సంవత్సరంలో ఇద్దరు ముస్లిం మైనార్టీ యువతులు ఎంబిబిఎస్ సీట్లు సాధించడం మండలానికి కూడా చాలా గర్వకారణం అని, అదే విధంగా పిల్లలని ప్రోత్సహించి ఎంతో కష్టపడి ఈ స్థాయికి తీసుకొచ్చిన తల్లిదండ్రులకు గ్రామ ప్రజలు, బంధువులు , స్నేహితులు, స్థానిక పెద్దలు వీరి విజయాన్ని హర్షిస్తూ అభినందనలు తెలిపారు. సమాజంలోని ఇతర విద్యార్థులు వీరి విజయాన్ని ఆదర్శంగా తీసుకొని ఉన్నత విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోముస్లిం మైనార్టీ పెద్దలు, మస్జిద్ ఇమామ్ సాబ్ లు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు ఇచ్చిన 42శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

ప్రజాపక్షం/ములకలపల్లి: బీసీలకు ఇచ్చిన 42శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ నాయకులు సురభి రాజేష్ అన్నారు. శుక్రవారం హైకోర్టు తీర్పుతో తెలంగాణలో ఆగిన ఎన్నికల నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కామారెడ్డి సభలో బిసిలకు ఇచ్చిన హామీ మేరకు దేశంలోనే ఎన్నడూ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కుల గణన నిర్వహించి, దేశానికే ఆదర్శంగా తెలంగాణ రాష్ట్ర నిలిచిందన్నారు. హామీ అమలు మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. బిఆర్ఎస్, బిజెపి ఒక్కటై బీసీలకు న్యాయం జరగకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ కొలిక్కి వచ్చిందనుకున్న సమయంలో కోర్టు తీర్పు ఊహించలేదని తెలిపారు.

## ఘనంగా ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పిఎల్‌వి గుండెబోయిన రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ మంచిగా ఆరోగ్యంగా ఉండాలంటే ఏ విషయం అయినా పదే పదే ఆలోచించకుండా, మన గృహ వాతావరణంలో పచ్చని చెట్లు ఉండాలన్నారు. ఉమ్మడి కుటుంబంతో జీవిస్తూ ఉండాలని, సామూహికంగా మంచి చెడు విషయాల గురించి చర్చ సమావేశాలు జరుపుతూ ఉండాలని అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఆళ్లపల్లి గ్రామస్తులు ఎస్‌డి సాబీర్, రేసు సురేందర్, బూరుగడ్డ సత్యనారాయణ, కోటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై ఫీజుల భారాన్ని తగ్గించాలి

ప్రజాపక్షం/కారేపల్లి: డిగ్రీ ఫస్ట్ ఇయర్ విద్యార్థులపై ఫీజుల భారాన్ని తగ్గించాలని ప్రగతిశీల యుజవన సంఘం పివైఎల్ ఖమ్మం జిల్లా నాయకులు భూక్య శివ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం కారేపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కేయూ పరిధిలో డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ విద్యార్థులకు భారీగా పెంచిన వివిధ రకాల ఫీజులను తగ్గించాలన్నారు. గతం కంటే ఒకే సారి ఒక్కొక్క విద్యార్థిపై రూ 1910 ఫీజు భారం మోపుతుందని, ఒకే సారి ఇంత భారీ మొత్తంలో పెంచిన ఫీజులతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, పేద విద్యార్థులకు ఏ మాత్రం కట్టలేని పరిస్థితిలో ఫీజుల భారాన్ని విద్యార్థులపై ప్రభుత్వం మోపడం సరికాదని తక్షణమే ప్రభుత్వం ఆలోచించి ఫీజుల భారం తగ్గించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## రైళ్లను పునరుద్ధరించాలని డిఆర్ఎంకు వినతి




ప్రజాపక్షం/కారేపల్లి: కరోనా సమయంలో రద్దు చేసిన రైళ్లలో ఇంకా రెండు రైళ్ళను నేటికీ పునరుద్ధరించలేదని, ఆ రైళ్ళను పునరుద్ధరించాలని కోరుతూ సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్‌రెడ్డి డిఆర్ఎం గోపాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. కారేపల్లి రైల్వే స్టేషన్‌ను శుక్రవారం డిఆర్ఎం గోపాలకృష్ణ పరిశీలించారు. ఈసందర్భంగా కరోనా సమయంలో డోర్నకల్, భద్రాచలం రోడ్, మణుగూరు కాజీపేట జంక్షన్ ప్యాసింజర్ రైళ్లను నేటికి పునరుద్దరించలేదని ఆ రైళ్ళను పునరుద్దరించాలని, అలాగే డోర్నకల్ భద్రాచలం రోడ్ మధ్యలో నడుస్తున్న రైళ్లకు ఈ రైలు మార్గంలో ఉన్న అన్ని స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించాలని కోరుతూ డిఆర్ఎంకు సురేందర్‌రెడ్డి వినతి పత్రం అందించారు. ఈకార్యక్రమంలో సురేందర్ మనియార్, తురక నారాయణ, బిచ్యా నాయక్, తోగర శ్రీను, పాల్గొన్నారు.

## సొసైటీ సీఈఓకు సన్మానం



ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి సొసైటీ సీఈఓగా పని చేస్తున్న కుంచారపు శ్రీనివాస్ బదిలీపై గుంపె న సొసైటీకి సీఈఓగా వెళ్తున్న నేపథ్యంలో శుక్రవారం ములకలపల్లి సొసైటీ కార్యాలయంలో సొసైటీ ఛైర్మన్ నడిపల్లి సునంద, డైరెక్టర్లు, గ్రామస్తులు అభినందిస్తూ ఘనంగా సత్కరించారు. అనేక సంవత్సరాలుగా సొసైటీ సీఈఓగా పని చేస్తూ రైతులకు అనేక సేవలు అందించారని సొసైటీ ఛైర్మన్ సీఈఓ శ్రీను సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్, సొసైటీ డైరెక్టర్లు రవికుమార్, గోపాలరావు, సిపిఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, రైతులు పువ్వాళ లలితారావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# భార్యాభర్తలు పంతాలకు వద్దు..అనుబంధమే ముద్దు..!



-ఒకరినొకరు అర్థం చేసుకుంటే సంతోషానికి ఉండదు హద్దు
-మూడుముళ్ల బంధం అంటే మూణ్ణాళ్ల ముచ్చట కాదు
-అంతరించిపోతున్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ
-మానసిక ఒత్తిడికి లోను కావద్దు
-పంతాలకు పోయి పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకం చేయొద్దు

**ప్రజాపక్షం/వైరా:** ఉదయం లేచిన వద్ద నుండి రాత్రి వరకు జరిగే జీవన పోరాటంలో ఉరుకులు..పరుగుల జీవనంలో కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నంగా మారుతుంది. ఇలా ఉరుకులు పరుగుల జీవనంలో భార్యాభర్తల మధ్య సంబంధాలు ప్రేమానురాగాలు కొరవడుతున్నాయి. పంతాలు పట్టింపులకు పోవడం వలన వారి మధ్య ప్రేమా అనుబంధాలకు తుంచేస్తున్నాయి. మూడుముళ్ల బంధాలతో ప్రారంభమైన జీవితం మూన్నాళ్ళ ముచ్చటగానే మారుతున్నాయి. ఇటీవల కాలంలో పలుచోట్ల తరచుగా జరుగుతున్న దంపతుల మధ్య కల్లోలాలు రోజురోజుకు అధికమవుతున్నాయి. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తూ మంచి మంచి పొజిషన్‌లో ఉంటున్నారు. అయితే వారి ఉద్యోగరీత్యా భార్యాభర్తలు ఇద్దరూ ఇంట్లో కలిసి ఉండేది చాలా తక్కువే. ఎవరి ఉద్యోగాలు వారు చేసుకుంటూ ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో కుటుంబ పోషణ కోసం ఎంతో కష్టపడుతున్నారు. సాఫ్ట్‌వేర్ రంగం కావచ్చు, ప్రైవేటు రంగం కావచ్చు, ప్రభుత్వ ఉద్యోగులు కావచ్చు. ఇలా రకరకాల ఉద్యోగాల్లో ఉన్న భార్యాభర్తలు డబ్బు సంపాదిస్తున్నారు అనేది తప్ప వారి మధ్య ప్రేమానురాగాలకు కొంతమందిలో దూరం పెరిగి తీవ్ర అసహనానికి మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. అలాంటి టెన్షన్స్‌తో అన్యోన్యంగా ఉన్న దాంపత్యాలు చిన్న చిన్న విషయాలకే వారి మధ్య వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. సర్దుకుంటే పోయే సమస్యలను ఒకరి ఒకరు ఎక్కువగా తీసుకొని జీవితం అనే ప్రయాణాన్ని మరిచి వారి మధ్య ఏర్పడుతున్న చిన్న అంతర్యానికి గొడవలు పడుతూ దూరంగా ఉండే వరకు వెళుతున్నారు. భార్యాభర్తలు గొడవ పడటం వలన ఆ ప్రభావం పిల్లలపై పడి వారి భవిష్యత్తుని ప్రశ్నార్థకంగా మార్చే పరిస్థితి ఏర్పడుతుంది. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలను ఆలస్యంగా తెలుసుకున్న వారి కుటుంబ సభ్యులు, బంధువులు, సఖి కౌన్సిలింగ్ సెంటర్లు ద్వారా ఇద్దరికి కౌన్సిలింగ్ చేయించి మళ్లీ కలిసి ఉండేలా చూస్తున్నారు. మంచి ఉద్యోగాలు పిల్లలు వారి భవిష్యత్తు కోసం పోరాటం చేస్తున్న వారు చిన్న చిన్న మనస్పర్ధలతో రోడ్లకెక్కి కన్న తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అలా చేయకుండా కోపం వచ్చిన ఓర్పు ఎంతో అవసరం కోపం వచ్చినప్పుడు పది నిముషాలు ఇద్దరిలో ఏ ఒక్కరైనా కూల్‌గా ఆలోచిస్తే ఆ కుటుంబ జీవిత ప్రయాణంలో సంతోషంగా ఆనందంగా హ్యాపీగా కొనసాగుతుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చిన్న చిన్న మనస్పర్ధలతో అసహ్యంతో ఆలోచన చేయకుండా లేని సమస్యలను కొని తెచ్చుకుంటూ దాంపత్య జీవితాలకు దూరం అవుతున్నారు. జీవిత ప్రయాణానికి ఫుల్‌స్టాప్ పెడుతున్నారు. ఇది అత్యంత బాధాకరమైన సంఘటనని చెప్పవచ్చును. ఎందుకు అంటే భార్యాభర్తలు ఏ రంగంలో ఉన్న ప్రశాంతంగా ఉద్యోగాలు చేసుకుంటూ ఇంటికి వెళ్లి పిల్లలతో, తల్లిదండ్రులతో ప్రశాంతంగా కలిసి మెలిసి ఉంటూ కష్టసుఖాల్లో భాగస్వాములు అయితే ఒకరి కష్టానికి ఒకరు తోడైతూ ముందుకు సాగితే ఆ కుటుంబానికి అంతకు మించిన సంతోషం ఏదైనా ఉంటుందా? ఒక్కసారి ఆవేశంతో కాకుండా ఆలోచనతో ఆలోచించాలి. భార్యాభర్తలు కొంతమంది ఇలాంటి ఆలోచనలు చేయకుండా బంగారు భవిష్యత్తు లాంటి జీవిత నౌకను ప్రయాణం చేయకుండా నీటిలో మునిగేలా చూసుకుంటున్నారు. అలాంటి విషయాలకు దూరంగా ఉండి కోపం వచ్చిన సంతోషం వచ్చిన నా భార్య నా భర్త అనే ఒక ఆలోచనను మైండ్‌లో జీవితాంతం ఉండిపోయేలా చూసుకుంటూ కోపాలకు దూరంగా ఉంటూ ఒకరినొకరు అర్థం చేసుకుంటూ జీవితంలో ముందుకు వెళితే అలాంటి బంగారు భవిష్యత్తు మరెక్కడా ఉండదు. ప్రస్తుతం రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో రోజు జరిగే సంఘటన టివిల్లో పత్రికల్లో చూస్తూనే ఉంటాము. చిన్న మనస్పర్ధలతో గొడవపడి కొంతమంది దంపతులు, పెద్దలు చెప్పిన కౌన్సిలింగ్ ఇచ్చిన వారిలో మార్పు రాకుండా ఉండే వారి సంఖ్య కూడా పెరుగుతూనే ఉందని చెప్పవచ్చును. చివరికి ఆ సమస్య కోర్టు వరకు వెళ్లి విడాకులు కావాలని ఆశ్రయిస్తున్న వారు కూడా లేకపోలేదు. మూడుముళ్ల బంధం అంటే జీవితాంతం కొనసాగే బంధం. మూన్నాళ్ళ ముచ్చట కాదు, మూడుముక్కల ఆట కాదు అదో జీవిత నౌక. అలాంటి నౌకలో ప్రయాణించాలి తప్ప అంతరాయం కలిగించకూడదు. విద్యావంతులై, ఉద్యోగాలు సంపాదించి చిన్న చిన్న మనస్పర్ధలతో భార్యాభర్తలు గొడవపడి విడిపోయే పరిస్థితి తెచ్చుకుంటున్నారంటే మీరు చదువుకున్న చదువు ఎలాంటిది. మీకు నేర్పిన సంస్కరణ ఎలాంటిది? మీ తల్లిదండ్రులు మీ మీద పెట్టుకున్న ఆశలు ఏమిటి? మీ పిల్లల భవిష్యత్తు ఏమిటి ఒక్కసారి ఆవేశంతో కాకుండా ఆలోచనలతో పోవడం ఎంతో మంచిది.

### అంతరించిపోతున్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ...

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అంతరించిపోతుంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అంతరించిపోతుంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో ఒకప్పుడు ఇళ్లలో అమ్మమ్మ బామ్మలు, తాతయ్యలు ఉండేవారు. వారే భార్యాభర్తల మధ్య ఏదైనా సమస్యలు వస్తే ఆ సమస్యలను పరిష్కరించేవారు. ఏదైనా సమస్యలు వస్తే ఆ సమస్యలను పరిష్కరించేవారు. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా పెరిగిన నూతన టెక్నాలజీలో ఆ పరిస్థితులు ఎప్పుడు కనిపించడం లేదు. భార్యాభర్తల మధ్య తలెత్తుతున్న చిన్నపాటి విబేదాలు పోలీస్‌స్టేషన్ వరకు దారి తీస్తున్నాయి. అక్కడ వరకు వెళ్లిన తర్వాత కాని చివరకు తమ తప్పులను తెలుసుకొని కౌన్సిలర్లను ఆశ్రయిస్తున్నారు.

### విధి నిర్వహణలో ఒత్తిడి...

విధి నిర్వహణలో ఒత్తిడి..చికాకు, కోపం పెరగడం, దాంపత్య జీవనంలో బేదాభిప్రాయాలకు కారణమవుతున్నాయి. మరోవైపు సెల్‌ఫోన్, కంప్యూటర్లు కూడా భార్యాభర్తల మధ్య వివాదాలకు దారితీస్తున్నారు. తన భర్త నాతో కన్నా కంప్యూటర్, సెల్‌ఫోన్‌లోనే ఎక్కువగా గడుపుతున్నాడని, ఎవరెవరితోనే ఫోన్‌లో మాట్లాడుతున్నాడని, ఇలాంటి సందర్భాల్లో కూడా వారి మధ్య గ్యాప్‌కు తావిస్తుంది. కాని ఎవరితో మాట్లాడుతున్నాడు, ఎందుకు మాట్లాడుతున్నారు అనేది తెలుసుకుంటే సమస్య పరిష్కారం అవుతుంది. సమస్యలను ప్రక్కన పెట్టండి, ఆలోచించండి, ఆనందంగా ఉండండి. ఇది మన పెద్దల మాట.

# ఆక్రమణదారులకు అడ్డేది..?



-ఫుట్ పాత్ ను సైతం వదలని వైనం
-మణుగూరు సామాజిక కార్యకర్త లాయర్ కర్నే రవి
-ఫుట్ పాత్ ఆక్రమణలు తొలగించాలని మున్సిపాలిటీ కమిషనర్‌కు వినతి
-ఇబ్బందులకు గురవుతున్న పాదాచారులు

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు సురక్ష బస్టాండ్ పరిధిలో ఆక్రమణదారులకు అడ్డు లేకుండా పోయింది. ఆక్రమించడానికి స్థలం లేదా అంటూ పాదాచారులు ప్రశ్నిస్తే అవమానకరమైన మాటలతో వాళ్లని హింసిస్తున్నారని సామాజిక కార్యకర్త కర్నే రవి శుక్రవారం ఆరోపించారు. ఈ విషయమై మణుగూరు మున్సిపాలిటీ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని సురక్ష బస్టాండ్ సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ప్రధాన రహదారిని ఆక్రమించారని తెలిపారు. రహదారిని ఆక్రమించడమే కాకుండా షాపులు నిర్మించి, ఫుట్ పాత్ మీద, వీధి వ్యాపారులుకు రెంట్ కు ఇస్తూ 3000 నుండి 5000 రూపాయలు అక్రమంగా అద్దె సంపాదిస్తున్నారని అన్నారు. ఇదేమిటని ప్రశ్నించే పాదాచారులు, ద్విచక్ర వాహనదారులపై సైతం తిరగబడుతున్నారని, వారిపై అసభ్యకరంగా మాట్లాడుతున్నారని రవి ఆరోపించారు. సురక్ష బస్టాండ్ దగ్గర ఉన్న ఫుట్ పాత్ పై ఆక్రమణలను ప్రధాన రహదారి పై ఇరువైపుల ఉన్న ఫుట్ పాత్ ఆక్రమణదారులు తొలగించాలన్నారు. ఈ విషయం మీద సామాజిక కార్యకర్త కర్నే రవి మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు.

# నేటి సుపోషిత బాలికలే.. రేపటి శక్తివంతమైన మహిళలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని మార్కెట్ యార్డ్ ఆవరణలో శుక్రవారం పోషణ మాసం సందర్భంగా పోషణ్ అభియాన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పిల్లలకు అన్న అన్నప్రాసన పోషక విలువలు కలిగిన పోషకాహార ప్రదర్శన పలు రకాలైన వంటకాలను ఐసిడిఎస్ కల్లూరు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. పోషకాహారంతో రాబోయే భవిష్యత్తులో బలమైన శక్తి కలిగిన మహిళలు గా సమాజంలో మెలగాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని నిర్మల జ్యోతి అన్నారు. కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో అంగన్‌వాడీ కేంద్రాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పలు రకాల వంటకాలను తయారుచేసి బలంగా ఉండాలంటే పోషకాలు కలిగిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని రాబోయే భవిష్యత్తులో ఎక్కువ ఆయుష్ కలిగి జీవించాలంటే తప్పనిసరిగా పోషక విలువ కలిగిన భోజనాన్ని తీసుకోవాలని ఆమె కోరారు. గత కొద్ది రోజుల నుంచి కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండలాల పరిధిలోని గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల పరిధిలో తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రాజెక్టు కేంద్రంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా అన్నప్రాసన, అక్షరాభ్యాసం, పలు రకాల కలిగిన పోషక విలువలు వంటకాలు తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని జరిగింది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, పర్యవేక్షకులు సుజాత, వెంకటమ్మ, భవాని లతోపాటు అంగన్వాడి ఉపాధ్యాయులు ప్రభావతి, వాణిశ్రీ, ప్రేమా భాయి, జ్యోతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారికి ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు.

# సింగరేణి ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/మణుగూరు:** మండల పరిధిలోని విఠల్ రావు నగర్‌లో శుక్రవారం సింగరేణి సేవా సమితి, సింగరేణి వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బొగ్గు గనుల పరిసర గ్రామాల ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే సింగరేణి యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా ఈ శిబిరం నిర్వహించబడింది. శిబిరంలో పెద్ద సంఖ్యలో మహిళలు, పురుషులు, వృద్ధులు, విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 155 మంది ప్రజలకు సాధారణ వ్యాధులకు ఉచిత మందులు పంపిణీ చేయగా, రక్తపోటు, చక్కెర వంటి వ్యాధుల నియంత్రణకు అవసరమైన మందులు కూడా అందజేశారు. ఈ సందర్భంగా డీజీఎం (పర్సనల్) ఎస్. రమేష్ మాట్లాడుతూ గ్రామస్తులు ఆరోగ్యంగా ఉండేందుకు ఇంటి పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి అని సూచించారు. గ్రామ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించినందుకు సింగరేణి వైద్య బృందాన్ని అభినందించారు. ఈ శిబిరంలో డాక్టర్ బెనర్జీ, స్టాఫ్ నర్స్ అనంతలక్ష్మి, సింగరేణి సేవా సమితి కోఆర్డినేటర్ కె.వి. మారేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి సిబ్బంది రామ, రాము, భాను, విఠల్ రావు నగర్ గ్రామస్థులు, విఠల్ రావు నగర్ శ్రీరామ్ యూత్ పాల్గొన్నారు.

# సాయిస్ఫూర్తి విద్యార్థుల పారిశ్రామిక సందర్శన




**ప్రజాపక్షం/సత్తుపల్లి :** మండల పరిధిలోని గంగారంలో గల సాయి స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఇంజనీరింగ్ (ఈఈఈ)డిప్లొమా విద్యార్థులను పారిశ్రామిక శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా, మోతుగూడెం మండలంలో గల ప్రముఖ లోయర్ సీలేరు పవర్ ప్లాంట్ ను శుక్రవారం సందర్శించారు. విద్యార్థులు తమ సబ్జెక్టులలో తెలివి తేటలను, నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఇటువంటి పారిశ్రామిక సందర్శనలు ఎంతగానో అవసరమని కళాశాల ప్రిన్సిపాల్ డా.వూటుకూరి.శేషారత్నకుమారి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు పవర్ ను అందించాలంటే మనము జాగ్రత్తగా వాడుకొని భవిష్యత్ తరాలకు అందించగలిగితే అంతగా భవిష్యత్తు బాగుంటుందని చెప్పారు. పవర్ యొక్క విలువలను వాటిని శుద్ధి చేయటం, భూగర్భ పవర్ ను పెంపొందించడం అనే అంశాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో షేక్ సైదులు, కె.ప్రతిమ, యన్ జి వి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.